
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

ఆదివారం । 4 । మే । 2025



సోమశిలలో 50.994 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో 50.994 టీఎంసీల నీరు శనివారం ఉంది. కాలువలకు 1110 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.96,500
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.8,755
3శాతం జీఎస్టీతో	రూ.9,018
నవర (8గ్రా)	రూ.72,144

గరిష్టం/కనిష్టం
40.1 /29.0

వాతావరణం

ఆదివారం పొడి వాతావరణం ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ శనివారం 60 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్



న్యాయశాఖ ఉద్యోగుల సంఘ భవనాన్ని ప్రారంభిస్తున్న జిల్లా జడ్జి జి శ్రీనివాస్

నెల్లూరు (లీగల్): జిల్లా న్యాయశాఖ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్ తెలిపారు. జిల్లా కోర్టు ఆవరణలో న్యాయశాఖ ఉద్యోగుల సంఘ భవనాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి శనివారం ప్రారంభించారు. జిల్లా న్యాయశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి సురేష్, నారాయణ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకుని వెళ్లగా స్పందించి ఉద్యోగులకు సంబంధించిన ఆర్థిక, వృత్తి పరమైన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఉద్యోగులు కష్టపడి పని చేయాలని, న్యాయస్థానానికి మంచి పేరు తీసుకుని రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోర్టు పరిపాలనాధికారి నాగరాణి, నాయకులు వెంకటసునీల్ కుమార్, ఋతి శివకుమార్, దీపక్ పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం



స్వామి, అమ్మవార్ల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

రాపూరు: మండలంలోని పెంచలకోనలో శనివారం పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. తెల్లవారుజామునే స్వామి, అమ్మవార్లను సుప్రభాతంతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. అనంతరం విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. 6 గంటలకు పూలంగి సేవ నిర్వహించారు. 10 గంటలకు స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను కల్యాణ మండపంలో కొలువుదీర్చి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. సాయంత్రం ఊంజల్ సేవ చేశారు.

నేడు పది కేంద్రాల్లో నీట్

- హాజరుకానున్న 2,913 మంది విద్యార్థులు

నెల్లూరు (టౌన్): నీట్‌ను ఆదివారం జిల్లాలో పది జూనియర్, ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించనున్నారు. నగరంలోని స్టోన్‌హౌస్ పేటలోని పీఎస్ఆర్ఎంసీహెచ్ స్కూల్, కొత్తూరులోని కేంద్రీయ విద్యాలయం, దర్గామిట్టలోని డీకేడబ్ల్యూ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జూనియర్ కళాశాల, ఏసీనగర్‌లోని ఎంపీఎల్ కార్పొరేషన్ హైస్కూల్, పొదలకూరు రోడ్డులోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ బాలుర పాలిటెక్నిక్ కళాశాల, పప్పులవీధిలోని వైవీఎం నగర పాలక ఉన్నత పాఠశాల, సంతపేటలోని ఆదర్శ ఉన్నత పాఠశాలల్లో పరీక్ష నిర్వహించనున్నారు. ఈ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా మొత్తం 2,913 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు జరగనుంది. విద్యార్థులను ఉదయం 11 గంటల నుంచే కేంద్రాల్లోకి అనుమతిస్తారు. మధ్యాహ్నం 1.30 తరువాత అనుమతించరు.


మాలకొండ మాల్యాద్రికి రూ.11.79 లక్షల ఆదాయం

వలేటివారిపాలెం: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానానికి శనివారం రూ.11.79 లక్షలు ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ కే సాగర్‌బాబు తెలిపారు. కుంకుమార్చన ద్వారా రూ.20,840, తలనీలాలు రూ.72,375, ప్రత్యేక దర్శనం రూ.4,35,200, రూమ్ అద్దెలు రూ.35,330, లడ్డు ప్రసాదాలు రూ.2,47,390, అన్నదానానికి రూ.3,30,518 ఇతర విరాళాలు కలిపి ఆదాయం రూ.11,79,689 వచ్చినట్లు ఆయన తెలిపారు.

సంతృప్తికరంగా లక్ష్మీనరసింహుడి దర్శనం

రాపూరు: పెంచలకోనలో ఈనెల 8 నుంచి 14వ తేదీ వరకు జరిగే బ్రహ్మోత్సవాల్లో ప్రతి ఒక్క భక్తుడూ సంతృప్తిగా శ్రీపెనుశిల లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకునేలా ఏర్పాటు చేస్తున్నట్టు రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. పెంచలకోనలో బ్రహ్మోత్సవ ఏర్పాట్లపై వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణతో కలసి సమన్వయ కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల్లో గరుడసేవ, కల్యాణోత్సవం రోజుల్లో ఎన్నడూ లేని విధంగా ప్రతి ఒక్కరికీ ఉచిత లడ్డూ అందించాలని ఆదేశించారు. నెల్లూరు ఆర్డీఓ అనూషా, దేవదాయశాఖ ఏసీ జనార్దన్‌రెడ్డి పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పొగాకు.. పగా కాయె



రైతులకు దక్కని గిట్టుబాటు ధరలు

- సాగు ఖర్చు పెరిగినా తగ్గిన ఆదాయం
- ఆందోళన వ్యక్తం చేస్తున్న కర్షకులు

పొగాకు పగాకుగా మారింది. ధర దారుణంగా పడిపోయింది. ఏం చేయాలో తెలియని దిక్కుతోచని స్థితిలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. కనీసం పెట్టుబడి ఖర్చులైనా దక్కితే చాలన్న దీన స్థితిలో ఆశగా ఎదురుచూస్తున్నారు. గత ఏడాది గరిష్టంగా కిలోకు రూ.390 వరకు పలికిన ధర.. ఈ ఏడాది ప్రారంభం నుంచే రూ.280కు మించలేదు. దీంతో రైతులు తీవ్ర ఆవేదనకు లోనవుతున్నారు.

మర్రిపాడు: ఒక వైపు ప్రకృతి వైపరీత్యాలు, మరో వైపు వాతావరణ అననుకూల పరిస్థితి. ఇదికాక పంటకు అధిక పెట్టుబడులు.. వెరసి పొగాకు రైతులను మనోవేదనకు గురిచేస్తున్నాయి. వేలకు వేలు పెట్టుబడులు పెట్టి సాగు చేసుకున్న రైతులకు సరైన మద్దతు ధర లేకపోవడంతో నష్టాలు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇలాంటి పరిస్థితుల్లో ఏమి చేయాలో దిక్కుతోచక అయోమయంలో పొగాకు రైతులు ఉండిపోయారు. నాణ్యమైన పొగాకుకు కూడా రూ.280 గరిష్ట ధర దాటకపోవడంతో దిక్కుతోచని స్థితిలో రైతులు ఊగిసలాడుతున్నారు. ధరల పెరుగుదలలో మార్పు లేకపోవడం, కొనుగోళ్లు మందకొడిగా సాగుతుండడంతో రైతుల్లో తీవ్ర నైరాశ్యం నెలకొంది.

పెరిగిన సాగు ఖర్చులు

గత ఏడాది లభించిన విధంగానే ఈ ఏడాది ధరలు లభిస్తాయనే ఆశతో పొగాకు సాగు చేపట్టిన రైతులకు వేలం ప్రారంభం నుంచి లభిస్తున్న ధరలతో తీవ్ర ఆవేదన చెందుతున్నారు. గత ఏడాదితో పోల్చుకుంటే దాదాపు 30 శాతం సాగు ఖర్చులు పెరిగాయి. ఎకరాకు సుమారు రూ.30వేలు అధికంగా ఖర్చు అయిందని, అదే విధంగా ధరలు లభిస్తాయని ఆశించామని, అయితే ప్రస్తుతం లభిస్తున్న ధరలతో తాము పెట్టిన పెట్టుబడి అయినా లభిస్తుందా అనేది సందేహమేనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటి వరకు రూ.52.78 కోట్ల వ్యాపారం

మార్చి 3వ తేదీన ప్రారంభమైన పొగాకు వేలంలో ఇప్పటి వరకు రూ.52.78 కోట్ల వ్యాపారం జరిగింది. వేలానికి 19,314 పొగాకు బేళ్లు రాగా వాటిలో 15,305 బేళ్లను విక్రయించారు. మిగిలిన వాటిలో 338 నోసేల్, 2582 బేళ్లను నోబిడ్‌గా గుర్తించారు. 195 బేళ్లను రైతులు వెనక్కు తీసుకెళ్లారు. 597 పొగాకు బేళ్లను కంపెనీ వారు తిరస్కరించారు. ఇప్పటి వరకు మొత్తం వెనక్కు 3717 బేళ్లను పంపగా, 296 బేళ్లు జంపింగ్‌గా నమోదు అయ్యాయి. 18 కంపెనీలు వేలంలో పాల్గొన్నాయి. ఇప్పటి వరకు గరిష్ట ధర రూ.280 లభించగా కనిష్ట ధర రూ.210 లభించింది. ఇప్పటి వరకు రూ.1.99 మిలియన్ కిలోల పొగాకును విక్రయించగా రూ.52.78 కోట్ల వ్యాపారం జరిగింది.

కూటమి పాలనలో రైతులకు కష్టాలు



పొగాకు వేలం ప్రక్రియను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

- వైఎస్సార్‌సీపీ హయాంలో గిట్టుబాటు ధరలు
- ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

మర్రిపాడు: మెట్ట ప్రాంత పొగాకు రైతులు కూటమి ప్రభుత్వంలో కష్టాలు పడుతున్నారు. మూడు రోజుల క్రితం జిల్లాకు వచ్చిన సీఎం చంద్రబాబు.. డీసీపల్లి వేలం కేంద్రం వచ్చి రైతుల కష్టాలను చూసుంటే బాగుండేదని ఆత్మకూరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి అన్నారు. డీసీపల్లిలోని పొగాకు వేలం కేంద్రాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వేలం కేంద్రం నిర్వహణాధికారి రాజశేఖర్‌తో చర్చించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ఎప్పుడూ రైతులకు అండగా ఉంటుందని పేర్కొన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో పొగాకు రైతులు ఆశించిన మేర గిట్టుబాటు ధర లభించిందని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత గిట్టుబాటు ధర లభించక రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇది ఇలాగే కొనసాగితే ప్రతి రైతుకు రూ.4 లక్షల నుంచి రూ.5లక్షల వరకు నష్టపోయే ప్రమాదముందన్నారు. ఆయన వెంట రాష్ట్ర మున్సిపల్ విభాగ ప్రధాన కార్యదర్శి అల్లారెడ్డి ఆనంద్ రెడ్డి, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, పార్టీ మండల కన్వీనర్లు చెన్ను వెంకటేశ్వరరెడ్డి, నాగులపాటి ప్రతాప్ రెడ్డి, మాజీ కన్వీనర్లు గంగవరపు శ్రీనివాసులునాయుడు, బొర్రా సుబ్బిరెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కొండా వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి చిట్టెం శ్రీనివాసులు, చంద్రా నారాయణస్వామి, మాగంటి శ్రీనివాసులు అధిక సంఖ్యలో నాయకులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి



పొగాకు సాగు ఖర్చులు పెరిగాయి. అదే విధంగా ధరలు కూడా లభిస్తాయని ఆశిస్తే రైతులను నిరాశపరిచే విధంగా ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో పొగాకు ధరలు తగ్గుముఖం పట్టిన సందర్భంలో మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు సాగించి రైతులను ఆదుకున్నారు. ప్రస్తుతం అదే విధంగా రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఉంది.

– చంద్రా నారాయణస్వామి, తిక్కవరం

ఖర్చులు బాగా పెరిగాయి



గత సంవత్సరంతో పోల్చుకుంటే ఈ సంవత్సరం రైతులకు సాగు ఖర్చులు పెరిగాయి. 30 శాతం మేర ధరలు పెరగడంతో పాటు కూలి ఖర్చులు కూడా పెరగడంతో రైతులకు భారం మరింత పెరిగింది. పొగాకు ధరలు పెరిగితే తప్ప రైతులు ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడలేరు.

– బోయపాటి నారయ్య, తిక్కవరం

లోగ్రేడ్ పొగాకే కారణం



పొగాకు వేలానికి అధికంగా లోగ్రేడ్ పొగాకు రావడమే మార్కెట్ మందగమానికి కారణం. గత ఏడాదితో పోల్చుకుంటే ప్రస్తుతం సంవత్సరం ఇదే సమయానికి సరాసరిగా ఇదే ధర కొనసాగుతోంది. అంతేకాక ప్రపంచ మార్కెట్‌లో కూడా ఈ ఏడాది పొగాకు సాగు పెరిగింది. దీంతో ధరలు తగ్గుముఖం పట్టాయి.

– జీ రాజశేఖర్, వేలం నిర్వహణాధికారి, డీసీపల్లి

పైప్‌లైన్ పగిలి .. రోడ్డుపై చేరిన నీరు

నెల్లూరు దైకస్‌రోడ్‌లో ఆక్రమణలను ఇటీవల అధికారులు తొలగించారు. డ్రైనేజీ నిర్మాణాలకు అడ్డుగా ఉన్న వాటిని జేసీబీలతో కూల్చివేశారు. ఆక్రమణలు తొలగించే సమయంలో అండర్ గ్రౌండ్ వాటర్ పైప్‌లైన్ పగిలిపోయి వాటి నుంచి నీరు రోడ్డుపైకి ఎగబాకింది. దీంతో ఆ రోడ్డుపై వెళ్లే పాదచారులు, వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఆలస్యంగా సమస్యను గుర్తించిన అధికారులు రోడ్డుపై చేరిన నీటిని మోటార్లతో శనివారం తొలగించడం ప్రారంభించారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు



మోటార్ల సాయంతో నీటిని తోడుతూ..



దైకస్‌రోడ్‌పై చేరిన నీరు

ప్రసన్నతో అనిల్ మర్యాదపూర్వక భేటీ



నల్లపరెడ్డిని కలిసిన డాక్టర్ పి.అనిల్ కుమార్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్‌సీపీ రాష్ట్ర పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యులు, మాజీ మంత్రి డాక్టర్ పి.అనిల్ కుమార్ యాదవ్ శనివారం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యులు నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డిని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయ సమీకరణాలపైన, పార్టీ బలోపేతానికి చేయాల్సిన కృషి గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ వీరి చలపతిరావు, సీనియర్ నాయకులు కలువ బాల శంకర్ రెడ్డి, జొన్నవాడ దేవస్థానం చైర్మన్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, ఆఫ్కాఫ్ మాజీ చైర్మన్ కొండూరు అనిల్ బాబు, నెల్లూరు నగర కార్పొరేటర్ నీలి రాఘవ తదితరులు పాల్గొన్నారు.

కాలం చెల్లిన మందులపై నివేదికకు ఆదేశాలు

సాక్షి ఎఫెక్ట్..

ఉదయగిరి: ఉదయగిరి మండలం గండిపాలెం ఆరోగ్యకేంద్రంలో కాలం చెల్లిన మందులను మరుగుదొడ్ల గదుల్లో వేయడంపై శనివారం 'సాక్షి'లో వార్త రావడంతో జిల్లా వైద్య ఆరోగ్య అధికారులు స్పందించారు. దీనిపై పూర్తి స్థాయి నివేదిక ఇవ్వాల్సిందిగా సంబంధిత వైద్యాధికారిణికి ఆదేశాలు ఇచ్చారు. అయితే మందులు పంపిణీ చేయకపోవడానికి ముఖ్య కారణమైన ఫార్మసిస్టు జిల్లా వైద్యఆరోగ్య కార్యాలయంలో డిప్యూటేషన్‌పై ఉంటూ వారానికి ఒకసారి వస్తున్నట్లు వైద్య సిబ్బంది చెబుతున్నారు. వాస్తవంగా ఆ శాఖలో అన్ని రకాల డిప్యుటేషన్లను ప్రభుత్వం రద్దు చేసింది. అయినా ఫార్మసిస్టు ఇంకా ఎందుకు జిల్లా కార్యాలయంలో ఉన్నారో అంతుబట్టని ప్రశ్న. జిల్లా అధికారులు వెంటనే ఆ డిప్యుటేషన్ రద్దు చేసి గండిపాలెం పీహెచ్‌సీ విధులకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

డిమాండ్లు తీర్చే వరకు సమ్మెలోనే..

- స్పష్టం చేసిన సీహెచ్‌ఓ అసోసియేషన్ నాయకులు



కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ నిరసన

నెల్లూరు(అర్బన్): తమ డిమాండ్లు నెరవేర్చేంతవరకు విధులు బహిష్కరించి సమ్మె కొనసాగిస్తామని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు భానుమహేష్ తెలిపారు. తమను రెగ్యులర్ చేయాలని, ఫిక్స్‌డ్ జీతం ఇవ్వాలని, ఆయుష్మాన్ భారత్ భవనాల అద్దె చెల్లించాలని, ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో సమానంగా తమకు 23 శాతం వేతనాలు పెంచాలని కోరుతూ డీఎంహెచ్‌ఓ కార్యాలయం వద్ద సీహెచ్‌ఓలు చేస్తున్న ఆందోళనలు శనివారం ఆరో రోజుకి చేరుకున్నాయి. ఈ సందర్భంగా భానుమహేష్ మాట్లాడుతూ తాము ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఒక్క మాట కూడా మాట్లాడలేదన్నారు. తమ డిమాండ్లపై చర్చించి న్యాయం చేయాలని కోరుతున్నామన్నారు. అప్పటి వరకు సమ్మె కొనసాగించి తీరుతామన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి రెబకా, జిల్లా సమన్వయకర్త ఆదిల్, కార్యనిర్వాహక సభ్యులు మాబ్‌జాని, సుమాంజలి, పలువురు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సైదాపురం అక్రమాలపై సినిమా తీయొచ్చు

- కూటమి ప్రభుత్వానిది దోపిడీ పాలన
- వెంకటగిరి వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి రాంకుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): సైదాపురం అక్రమాలపై సినిమా తీయొచ్చని వైఎస్సార్‌సీపీ వెంకటగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి అన్నారు. శనివారం నెల్లూరులో జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వెంకటగిరి నియోజకవర్గంలో అక్రమాలు, అన్యాయాలు అధికమయ్యాయన్నారు. దీనిపై కేసులు పెడితే పోలీస్ స్టేషన్‌లోనే విచారణలు, తీర్పులు జరుగుతున్నాయన్నారు. వెంకటగిరి మున్సిపాలిటీలో చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టిన కూటమి నేతలు ఓడిపోయారన్నారు. నియోజకవర్గంలో ప్రభుత్వ భూములు లాక్కోవడం, ఇసుక కనిపిస్తే దోచుకోవడం చేస్తున్నారన్నారు. కలువాయి మండలం తెలుగు రాయపురం, రాజుపాలెం వద్ద అక్రమంగా ఇసుక రీచ్‌లు ఏర్పాటు చేసి రోడ్లు వేసి ఇసుక తరలిస్తూనే ఉన్నారన్నారు. అధికారులకు చెబితే తూతూ మంత్రంగా తనిఖీలు చేపట్టడం తప్ప చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఇసుక మొత్తం బెంగళూరుకు తరలిస్తున్నారన్నారు. అధికార పార్టీ నాయకుల అరాచకం పరాకాష్టకు చేరిందన్నారు. సంపద సృష్టి పేరుతో స్కాంలు చేస్తున్నారని విమర్శించారు. నాలుగు నెలల ముందు స్థాపించిన ఫిని క్వార్ట్జ్ కంపెనీ ఒక్కటే క్వార్ట్జ్ ఖనిజం మొత్తం ఎగుమతులు చేస్తుందన్నారు. ఎన్నో సంవత్సరాలుగా వున్న కంపెనీలు మాత్రం మూత బడిపోయాయని తెలిపారు. తాము అధికారంలోకి వస్తే ఈ కంపెనీ అక్రమ వ్యవహారాలు అన్ని బయటకు తీస్తాం అన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఎందుకు మౌనంగా ఉన్నట్టు, అడవుల్లో కూడా అక్రమ మైనింగ్ చేస్తుంటే మాట్లాడరా? కాకినాడలో సీజ్ ద షిప్ అన్న పవన్ సైదాపురంలో జరుగుతున్న అక్రమ మైనింగ్‌పై ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. ఈ అక్రమాలపై కలెక్టర్, ఎస్పీ దృష్టికి తీసుకువెళ్తామన్నారు. అమరావతి రాజధాని అనేది పెద్ద డ్రామా అన్నారు. కూటమి ప్రభుత్వం మరో రెండేళ్లు మాత్రం అధికారంలో ఉంటుందని, 2027 లో జమిలి ఎన్నికలు వస్తాయని, వైఎస్సార్‌సీపీ సింగిల్ లార్జెస్ట్ పార్టీగా అవతరిస్తుందన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ సైదాపురం మండల కన్వీనర్ మన్నారు రవి, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, రాపూరు మండల కన్వీనర్ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిట్టి ఫ్రెండ్.. నేనున్నాగా..!

ఆనాడు.. రావణుడ్ని సంహరించేందుకు లంక పయనమైన శ్రీరాముడికి సాయంగా రామసేతు నిర్మాణానికి ఉడత సహకరించిందనే విషయం మనందరికీ తెలిసిందే. దీన్ని పుణికి పుచ్చుకొని తన సాయగుణాన్ని మరోసారి అది ప్రదర్శించింది. కలెక్టరేట్ సమీపంలో గల పార్కులో ఎండను తాళలేక ఓ ఉడత శనివారం స్పృహ కోల్పోయింది. దీంతో సమీపంలో ఉన్న మరో ఉడత వెంటనే స్పందించి కుక్కలు, గద్దల బారిన పడ కుండా ఉండేందుకు దాన్ని నోటితో కరుచుకొని చెట్టెక్కింది. ఎవరైనా ఆపదలో ఉంటే మనకెందుకులే అంటూ పక్కకు వెళ్లిపోతున్న ఈ రోజుల్లో వీటిని చూసి ఎంతో నేర్చుకోవాల్సిన అవసరం ఉంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు


ఏమైంది మిత్రమా..?


ఉండు.. నిన్నెక్కడికైనా జాగ్రత్తగా తీసుకెళ్తా


చెట్టెక్కుదాం..


కాస్త ఓపిక పట్టు.. నువ్వు సేఫ్

టెన్నిస్‌బాల్ క్రికెట్ పోటీలు ప్రారంభం



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో అండర్ – 14 సౌత్‌జోన్ బాలబాలికల టెన్నిస్‌బాల్ క్రికెట్ పోటీలను శనివారం ప్రారంభించారు. పోటీలకు దక్షిణాదిలోని వివిధ రాష్ట్రాల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. డీఎస్‌డీఓ యతిరాజ్, టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, డాక్టర్ పిట్టి మల్లికార్జున, టెన్నిస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు యుగంధర్, నిర్వాహక కార్యదర్శి అజయ్‌కుమార్, సభ్యులు మల్లిక, చరణ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

'డీకేడబ్ల్యూ'లో సర్టిఫికెట్ కోర్సు

నెల్లూరు (టౌన్): నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్ డొమెస్టిక్ నాన్ వాయిస్ సర్టిఫికెట్ కోర్సును రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 15న ప్రారంభించనున్నామని ప్రిన్సిపల్ గిరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 35 ఏళ్లలోపు, పదో తరగతి చదివిన మహిళలు అర్హులని చెప్పారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్, ఉద్యోగాన్ని కల్పించనున్నారని, ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 129
లేయర్ (లైవ్)	: 100
బ్రాయిలర్ చికెన్	: 230
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 254
లేయర్ చికెన్	: 170



విద్యుత్ బకాయిలపై దృష్టి సారించాలి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ బకాయిలపై అధికారులు, సిబ్బంది దృష్టి సారించాలని ఎస్పీడీసీఎల్ రెవెన్యూ, ఇంటర్నల్ ఆడిట్ విభాగ చీఫ్ జనరల్ మేనేజర్ రాజశేఖర్ ధర్మజ్ఞాని ఆదేశించారు. నగరంలోని విద్యుత్ భవన్‌లో జిల్లా అధికారులతో శనివారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. బిల్లుల చెల్లింపులను సులభతరం చేసేందుకు గానూ బకాయిల్లేని వినియోగదారుల బిల్లులపై క్యూఆర్ కోడ్‌ను ముద్రిస్తున్నామని వివరించారు. విద్యుత్ సమస్యలపై టోల్‌ఫ్రీ నంబర్ 1912 లేదా వాట్సాప్ గవర్నెన్స్ 95523 00009ను సంప్రదించాలని కోరారు. అదనపు లోడ్ క్రమబద్ధీకరణకు 50 శాతం రాయితీని సంస్థ కల్పిస్తోందని, దీనిపై వినియోగదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలో డీసీ లిస్ట్ ఎక్కువగా ఉందని, దీన్ని తగ్గించాలన్నారు. ఎస్‌ఈ విజయన్, సూర్య ఘర్ జిల్లా నోడల్ అధికారి శేషాద్రిబాలచంద్ర, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ మురళి, ఈఈ పరంధామయ్య తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాజశేఖర్

ట్రాలీని ఢీకొన్న గూడ్స్ వాహనం

• వ్యక్తి దుర్మరణం

గుడ్లూరు: ట్రాలీని గూడ్స్ వాహనం ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని తెట్టు ఫ్లైఓవర్ వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఎస్సై వెంకట్రావు వివరాల మేరకు.. విజయవాడలోని కృష్ణలంకకు చెందిన పక్కెళ్ల శ్రీనివాసరావు (48) గూడ్స్ వాహనాన్ని నడుపుకొని జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో జిల్లాలోని కలిగిరిలో ఫర్నిచర్ సామగ్రిని వాహనంలో తీసుకెళ్లి తిరుగుపయనమయ్యారు. ఇదే సమయంలో ట్రాలీ లారీ చెన్నై నుంచి యంత్రాలతో జార్ఖండ్‌లోని జంషెడ్‌పూర్‌కు వెళ్తోంది. ఈ తరుణంలో ముందు వెళ్తున్న ట్రాలీని ఆటో ఢీకొనడంతో శ్రీనివాసరావు అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న హైవే పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని కందుకూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


ఘటన స్థలంలో విగతజీవిగా శ్రీనివాసరావు

నిమ్మ ధరలు

పెద్దవి	: రూ.90
సన్నవి	: రూ.50
పండ్లు	: రూ.30

పెన్నాలో మృతదేహం లభ్యం

నెల్లూరు సిటీ: నగరంలోని దీన్‌దయాళ్‌నగర్ సమీపంలో గల పెన్నానదిలో గుర్తుతెలియని (45) వ్యక్తి మృతదేహం శనివారం లభ్యమైంది. వివరాలు.. నీటిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కొట్టుకురావడాన్ని స్థానికులు గుర్తించి నెల్లూరు రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకొని వివరాలను పోలీసులు సేకరించారు. మృతుడి వద్ద ఎలాంటి వివరాలు లభించలేదు. పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

నెల్లూరు (క్రైమ్): రైలు ఢీకొనడంతో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన నగరంలోని విజయమహల్ గేట్ సమీపంలో శనివారం చోటుచేసుకుంది. వివరాలు.. గేట్ వద్ద రైలు ఢీకొనడంతో వ్యక్తి మృతి చెంది ఉండటాన్ని గమనించిన స్థానికులు..రైల్వే పోలీసులకు సమాచారమిచ్చారు. ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని వారు పరిశీలించారు. మృతుడి వద్ద ఎలాంటి వివరాలు లభ్యం కాలేదు. మృతుడు బ్లూ కలర్ వైట్ చెక్స్ గల ఫుల్ హ్యాండ్స్ చొక్కా, సిమెంట్ రంగు ప్యాంట్‌ను ధరించి ఉన్నారు. మృతుడికి 45 ఏళ్లు ఉండొచ్చని భావిస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళకు కత్తిపోట్లు



నెల్లూరు(క్రైమ్): పిల్లలను ఎందుకు బెదిరిస్తున్నావని ప్రశ్నించిన మహిళపై లారీ డ్రైవర్ కత్తితో దాడి చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. బుజబుజనెల్లూరుకు చెందిన మాబున్నీసా, గౌస్ దంపతులకు ఇద్దరు పిల్లలు. అదే ప్రాంతానికి చెందిన లారీ డ్రైవర్ విజయ్ పూటుగా మద్యం సేవించి, అటుగా వెళ్తున్న వారిని కత్తితో శనివారం బెదిరించసాగారు. ఈ నేపథ్యంలో మాబున్నీసా పిల్లలను కత్తితో బెదిరించడంతో వారు భయపడి విషయాన్ని తల్లికి తెలియజేశారు. దీంతో ఎందుకు భయపెడుతున్నావని ఆమె ప్రశ్నించగా, ఆగ్రహానికి గురైన విజయ్ తన వద్ద ఉన్న కత్తితో దాడి చేశారు. మూడు చోట్ల బలంగా పొడిచి అక్కడి నుంచి పరారయ్యారు. గాయపడిన ఆమెను చికిత్స నిమిత్తం జీజీహెచ్‌లో కుటుంబసభ్యులు చేర్పించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉంది. సమాచారం అందుకున్న వేదాయపాళెం ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు ఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (లీగల్): జిల్లా కోర్టు యూనిట్‌లోని నెల్లూరు, కోవూరు, కావలి, ఆత్మకూరులో ఖాళీగా ఉన్న నాలుగు సెకండ్ క్లాస్ స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు నోటిఫికేషన్లో పేర్కొన్న అర్హతల మేరకు నిర్దిష్ట ప్రొఫార్మాలో తమ దరఖాస్తులను ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ కోర్టుకు ఈ నెల 31 సాయంత్రం ఐదు గంటల్లోపు పంపాలని కోరారు. కాగా నాలుగు పోస్టులకు ఇద్దరి నుంచే దరఖాస్తులు రావడంతో నోటిఫికేషన్ గడువును ఈ నెలాఖరు వరకు పొడిగించారు.

కండలేరులో నీటి నిల్వ



రాపూరు: కండలేరు జలాశయంలో శనివారం నాటికి 45.132 టీఎంసీల నీరు నిల్వ ఉందని ఈఈ విజయకుమార్ రెడ్డి తెలిపారు. సత్యసాయిగంగకు 160, పిన్నేరుకు 100, లోలెవల్‌కు 50, హైలెవల్‌కు 30, మొదటి బ్రాంచ్ కాలువకు ఐదు క్యూసెక్కులను విడుదల చేస్తున్నామని వివరించారు.

సీఐ మానవత్వం


పెంచలయ్యను పరామర్శిస్తున్న సీఐ గంగాధర్

ఆత్మకూరు: త్రిచక్రవాహనంపై వస్తూ అదుపు తప్పి గుంతలో పడిన దివ్యాంగుడ్ని కాపాడి.. మానవత్వాన్ని సీఐ చాటుకున్నారు. వివరాలు.. మండలంలోని కరటంపాడుకు చెందిన దివ్యాంగుడు పేరం పెంచలయ్య పని నిమిత్తం పట్టణానికి శనివారం బయల్దేరారు. ఈ క్రమంలో మార్కెట్ కమిటీ ఎదురుగా అతని వాహనం అదుపుతప్పి గుంతలో పడటంతో స్వల్పంగా గాయపడ్డారు. అదే సమయంలో ఆ ప్రాంతంలో వాకింగ్ చేస్తున్న సీఐ గంగాధర్ అతని వద్దకెళ్లి పరిశీలించారు. అనంతరం చికిత్స నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వెంటనే వైద్యం అందించాలని సిబ్బందిని సూచించారు.

పీపీపీతో మెరుగైన వైద్యసేవలు

• మంత్రి సత్యకుమార్‌యాదవ్

వింజమూరు(ఉదయగిరి): ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ)తో రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో కార్పొరేట్ స్థాయి వైద్యశాలలను నిర్మించి మెరుగైన వైద్యాన్ని అందిస్తామని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ పేర్కొన్నారు. వింజమూరులోని సీహెచ్‌సీలో ఐదు పడకల డయాలసిస్ సెంటర్‌తో పాటు నూతనంగా ఏర్పాటు చేసిన జనరేటర్‌ను శనివారం ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. రానున్న మూడు నెలల్లో పీపీపీ విధానంలో ఉదయగిరిలో 150 నుంచి 300 పడకల కార్పొరేట్ వైద్యశాల ఏర్పాటుకు అనుమతులను మంజూరు చేస్తామని చెప్పారు. దీనికి అవసరమైన భూమి, ఇతర సదుపాయాలను ప్రభుత్వం సమకూరుస్తుందని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రధానమంత్రి డయాలసిస్ పథకం ద్వారా 18 కొత్త కేంద్రాలను ప్రారంభించామని, వీటి నిర్వహణకు గానూ ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.65 కోట్లను మంజూరు చేశామని వెల్లడించారు. కాగా ఆరోగ్యశ్రీలో పేదలకు కార్పొరేట్ వైద్యసేవలు అందకపోగా, అధిక మొత్తంలో బిల్లులేసి ప్రభుత్వం నుంచి నగదును వసూలు చేస్తున్నారనే అంశాన్ని మంత్రికి మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి తెలియజేశారు. ఉదయగిరిలో మరో డయాలసిస్ కేంద్రంతో పాటు అత్యవసర వైద్య విభాగ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ కోరారు. మాజీ ఎమ్మెల్యేలు మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, కంభం విజయరామిరెడ్డి, కొమ్మి లక్ష్మయ్యనాయుడు, బీజేపీ నేత భరత్, ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, మెట్టుకూరి చిరంజీవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సత్యకుమార్